సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు బండి సంజయ్ సంఘీభావం

కేంద్ర సహాయ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

విద్యానగర్, డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు కేంద్ర మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవిస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం బండి సంజయ్ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలకు గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అందుకోసం సంక్రాంతి తర్వాత ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో లేను

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ నాయకత్వం తనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పెద్ద బాధ్యతలు అప్పగించిందని, ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తాను చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నానని చెప్పారు. తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగిస్తున్నారని వస్తున్న వార్తలు, జరుగుతున్న ప్రచారమంతా ఊహాగానాలేనని కొట్టిపారేశారు. అనంతరం బండి సంజయ్ స్థానిక మహాశక్తి ఆలయంలో జరిగిన అయ్యప్ప పడి పూజలో పాల్గొన్నారు.

టీజీవో జిల్లా నూతన కార్యవర్గానికి అభినందన

కొత్తపల్లి, డిసెంబర్ 15 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గాన్ని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన బాధ్యులు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి కార్యవర్గాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్‌గౌడ్, కార్యదర్శి డా. అరవింద్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాయకులు నాగరాజు, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత: నిందితుడి అరెస్ట్

రాంనగర్, డిసెంబర్ 15: నగరంలోని అశోక్ నగర్‌లో ఆదివారం వన్ టౌన్ పోలీసులు కిలో 655 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు.. వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన నీరజ్ కుమార్ ప్రస్తుతం అశోక్ నగర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. 5 నెలల క్రితం స్వగ్రామం సుర్జాపూర్ వెళ్లిపోయాడు. అక్కడ గంజాయికి అలవాటు పడ్డాడు. తాను కూడా గంజాయి అమ్మి అధిక లాభం సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. 15 రోజుల క్రితం స్వగ్రామంలో రెండు వేల రూపాయలకు రెండు కిలోల గంజాయిని కొని ట్రైన్‌లో కరీంనగర్ తీసుకువచ్చాడు. అప్పటి నుంచి అందులో నుంచి కొంత గంజాయిని వాడుకొని, మిగిలిన దానిని ఎవరికైనా అమ్ముదామని బైపాస్ వైపు పాలిథిన్ కవర్‌లో గంజాయిని తీసుకొని వెళ్తున్నాడు. గౌరిశెట్టి కాంప్లెక్స్ దగ్గరలో పోలీస్ వాహనాన్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి కిలో 655 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనపర్చుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు లర్న్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 15: బొమ్మకల్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఆదివారం కరీంనగర్‌కు చెందిన సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడు, హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ రూపొందించిన లర్న్ ఇంగ్లిష్ పుస్తకాలను పంపిణీ చేశారు. లైబ్రరీకి 40 పుస్తకాలు వితరణ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాస్‌యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటిరోజు హాజరు 49 శాతమే

ప్రశ్నపత్రాల తరలింపును పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్

- గ్రూప్ 2 పరీక్షలు ప్రారంభం
- కేంద్రాలకు చేరేందుకు అభ్యర్థుల తంటాలు
- సెంటర్ల చిరునామాలు తెలుసుకోలేక అనేకమంది గైర్హాజరు
- కళ్లు తిరిగి పడిపోయిన ఇద్దరు అభ్యర్థులు

కలెక్టరేట్/తిమ్మాపూర్, డిసెంబర్ 15 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్ 2 పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 49శాతం పైచిలుకు అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లాలో 26,978 మంది అభ్యర్థులకు గానూ మొదటి రోజు ఉదయం 13,273 మంది జనరల్ స్టడీస్ పరీక్ష రాశారు. 13,705మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్ పరీక్షకు 13,135 మంది హాజరుకాగా, 13,843 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల చిరునామాలు సక్రమంగా తెలుసుకోలేక అత్యధిక మంది సమయానికి సెంటర్లకు చేరుకోలేక పోయారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినా, కొన్నిచోట్ల సమన్వయ లోపంతో తీవ్ర ఇక్కట్లకు గురైనట్లు అభ్యర్థులు ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల సమాచారం సక్రమంగా లభించక, పరీక్ష సమయం దగ్గరపడుతుండగా అనేక మంది సెంటర్లు వెతకడంలో ఇబ్బందులు పడ్డారు. అల్పాహారం కూడా చేయకుండా సెంటర్లు వెతకడంలో నిమగ్నమైన ఇరువురు అభ్యర్థులు రాంనగర్‌లోని ఓ పరీక్ష కేంద్రం ఎదుట కళ్లు తిరిగి పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ పలు సెంటర్లు సందర్శించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలతో పాటు మహిళా డిగ్రీ కళాశాలలో కలెక్టర్ తనిఖీలు చేశారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో సహాయకురాలి సాయంతో ఓ అంధ అభ్యర్థి పరీక్ష రాస్తుండడాన్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. పరీక్ష ముగిసిన అనంతరం ఓఎంఆర్ షీట్లు అత్యంత జాగ్రత్తగా భద్రపర్చాలని, పరీక్షలు ముగిసేవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్‌తో పాటు ఇతర అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ నగరంలోని అల్ఫోర్స్ కళాశాల, ఎస్సారార్ కళాశాల, తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలు పరిశీలించారు. అంతకుముందు ఉదయం జిల్లా పరిషత్ సమావేశమందిరంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లను పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించారు. నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలు వాహనాల్లో పంపారు. అనంతరం ఓఎంఆర్ షీట్లను తిరిగి అత్యంత భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన పాలకవర్గ కమిటీ బాధ్యులు

విద్యానగర్, డిసెంబర్ 15: స్థానిక కొత్తయాస్వాడలోని శ్రీ భక్తాంజనేయ స్వామి, పోచమ్మ దేవాలయంలో నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ర్యాకం సుధాకర్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా న్యాలకొండ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొమ్మెన గిరిధర్ సతీశ్, రేగుల సంజీవ్ కుమార్ ముదిరాజ్, కట్ట నవీన్ కుమార్, కోశాధికారిగా గుమ్మడి రాజయ్య, ప్రచార కార్యదర్శిగా కూర్మాచలం మునీందర్, చంద్రగిరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా తోట రాజు, తోట శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వరాల పరశురాం, తూడి శ్రీనివాస్ రెడ్డి, నీలం సంపత్ రాజ్, కార్యవర్గ సభ్యులుగా పురుమాల్ల అంజయ్య, తూడి మోహన్‌రెడ్డి, వేల్పుల నర్సింగరావు, ఊరడి రవీందర్, కొమ్ము రమేశ్, బూరుగుపల్లి కిరణ్ కుమార్, కటకం జగదీశ్వర్, చవితి శశిధర్ రావు ఎన్నికయ్యారు.

నిత్యావసర సరుకుల వితరణ

చొప్పదండి, డిసెంబర్ 15: రాగంపేట గ్రామంలో 20 కుటుంబాలకు గామా ఫౌండేషన్ సీఈవో దుర్గా ప్రసాద్ ఆదేశాల మేరకు ఆహారభద్రతలో భాగంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గామా ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోగు నర్సయ్యపౌలు, ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేశ్, ఉపాధ్యక్షుడు గజ్జెల సతీశ్, మాజీ సర్పంచ్ లత - రాజేశం, మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణా రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగాసన పోటీలకు జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, డిసెంబర్ 15 : ఈనెల 16 నుంచి 20 వరకు కోయంబత్తూర్‌లో జరిగే జాతీయ స్థాయి పాఠశాలల యోగాసన అండర్- 14 పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. దేవంపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న తీట్ల హర్షిత్ బాలాజీ, పురాణం దీపక్, జుట్టు అశ్విత్ పోటీల్లో పాల్గొంటున్నారు. అలాగే, జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు కోచ్‌గా పి. రామకృష్ణ, మేనేజర్‌గా కొరిమి అనిల్ కుమార్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీ జనార్దన్‌రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణు, జిల్లా యోగ అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రిష్ట హౌస్ క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభించిన మంత్రి

బ్రిష్ట హౌస్ క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్, డిసెంబర్ 15: కరీంనగర్ పట్టణంలోని సీతారాంపూర్‌లో ఆదివారం బ్రిష్ట హౌస్ క్లౌడ్ కిచెన్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుమ్మడి సచిన్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకింగ్ చదరంగం పోటీలకు స్పందన

పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

కొత్తపల్లి, డిసెంబర్ 15 : జీనియస్ చెస్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగ పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో వివిధ గ్రామాల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓరియంట్ సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్ శ్రీనిధిరాజ్, డాక్టర్ నార్ల మహేందర్ డాక్టర్ జక్కని తిరుపతి పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఇందులో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వాసర గ్రూప్ యజమాన్యం నాగసముద్రం పురుషోత్తం, శశి, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్, ఎ దిరాజ్ గౌరీ నాయుడు, డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ జాయింట్ సెక్రటరీ కంకటి సుజన్ కుమార్, తాటిపల్లి సతీశ్ బాబు, ఆర్బిటర్లు నితిన్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు

కొత్తపల్లి, డిసెంబర్ 15 : సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్‌స్టేడియంతో పాటు ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి 21 వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. అంబేద్కర్ స్టేడియంలో ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, బేస్‌బాల్ పోటీలు జరుగనుండగా, ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జూడో పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాలోని 16 మండలాల నుంచి సుమారు 2000వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. స్టేడియంలో క్రీడాపోటీల ఏర్పాట్లను జిల్లా క్రీడా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా జూడో ప్రెసిడెంట్ రమేశ్‌రెడ్డి, ఖోఖో స్టేట్ రిఫరీ బోర్డ్ చైర్మన్ సూర్యప్రకాశ్, టీజీ పేట కార్యదర్శి అంతటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాప్‌లో చోరీకి యత్నం

రాంనగర్, డిసెంబర్ 15: నగరంలోని ముకరంపురలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ సెల్‌ఫోన్ షాప్‌లో గుర్తు తెలియని దుండగుడు చోరీకి యత్నించారు. కట్టారాంపూర్‌కు చెందిన సాయిరాం ఎస్ఆర్ఎం మొబైల్ పేరిట సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి యథావిధిగా షాప్ మూసివేసి ఇంటికివెళ్లగా ఆదివారం ఉదయం దుకాణం సమీపంలో ఉండే సాయిరాం స్నేహితుడు ఫోన్ చేసి షాపులు దొంగలు పడ్డారని సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న సాయిరాం పోలీసులకు సమాచారం అందించి పోలీసుల సహాయంతో పరిశీలించగా, సెల్‌ఫోన్ దుకాణంలో ఎలాంటి నష్టం జరుగలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా, ఒక గుర్తు తెలియని నిందితుడు షాపులోకి ప్రవేశించి కౌంటర్లను తెరిచి చూసినట్లుగా సీసీ కెమెరాలు ఫుటేజ్ లో లభ్యమైనది. సెల్ ఫోన్లు ఎత్తుకెళ్తే పట్టుబడే అవకాశం ఉండడంతో నిందితుడు క్యాష్ కౌంటర్లు మాత్రం తెరిచి వెళ్లిపోయినట్లుగా పోలీసులు గుర్తించారు. అయితే క్యాష్ కౌంటర్‌లో డబ్బు లేకపోవడంతో చోరీ చేయకుండానే వెళ్లిపోయినట్లు తెలుస్తున్నది. సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

యాజడే

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పే లోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడి వైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకు నుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు.

హింటిస్తే చాలు అల్లుకుపోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు.

తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాములని చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా అవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ నిర్లక్